నమస్తే తెలంగాణ
వరంగల్
10 | వరంగల్, బుధవారం 26 మార్చి 2025 | WARANGAL

■ కేసీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు ఎర్రవెల్లిలో కలిసి పలు అంశాలపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఉన్నారు. -నర్సంపేట, మార్చి 25

మార్కెట్‌లో డిమాండ్ ఉండే పంటలను ప్రోత్సహించి రైతులకు మేలు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు ఇవ్వాల్సిన నిర్వహణ ఖర్చులను చెల్లించడం లేదు. మొక్కల పెంపకం కోసం మొదటి ఐదేండ్లు అందించాల్సిన సబ్సిడీని కాంగ్రెస్ సర్కారు నిలిపివేసింది. వరంగల్ జిల్లాలో 1800, హనుమకొండ జిల్లాలో 929మంది రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ నిధులు చెల్లించాల్సి ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉన్నది. మొక్కల సంరక్షణకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో రైతులు అప్పులు చేసి తోటలను కాపాడుకోవాల్సి వస్తున్నది.

-వరంగల్, మార్చి 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- నిధుల్లేక మొక్కల సంరక్షణకు ఇబ్బందులు
- డబ్బులు లేవంటున్న ట్రెజరీ అధికారులు
- 2729మంది రైతులకు సబ్సిడీ పెండింగ్

ఆయిల్ పామ్ సబ్సిడీ రాలే

రైతులకు చెల్లింపులు నిలిపేసిన రాష్ట్ర ప్రభుత్వం

వరంగల్ జిల్లాలో 5,378 ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేసిన 1800 మంది రైతులకు రూ.2.40 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. హనుమకొండ జిల్లాలో 3032 ఎకరాల్లో ఈ పంటను సాగు చేసిన 929మందికి రూ.1.19 కోట్ల నిధులు రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. ఈ నిధుల కోసం రైతులు ఉద్యాన శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే సబ్సిడీ నిధుల వివరాలను ప్రభుత్వానికి పంపించామని, చెల్లింపుల విషయం ట్రెజరీ శాఖలో పెండింగ్‌లో ఉన్నదని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సబ్సిడీ నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమఅయ్యేవి. ఇప్పుడు చెల్లింపుల ప్రక్రియను ట్రెజరీ శాఖకు బదిలీ చేయడం వల్ల ఈ నిధులను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

■ వంట నూనెల వినియోగం రోజురోజుకు బాగా పెరుగుతున్నది. ప్రస్తుత అవసరాల కోసం మన దేశంలో పెద్ద ఎత్తున పామాయిల్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. పామాయిల్ దిగుమతితో మన దేశం నుంచి వేల కోట్ల రూపాయలు విదేశాలకు వెళ్తున్నాయి. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆయిల్‌పాం సాగు చేసి రైతులకు లాభం చేకూర్చే లక్ష్యంతో కేసీఆర్ ప్రభుత్వం చర్యలు తీసుకొని సాగు విస్తీర్ణం రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాలకు చేరేలా ప్రణాళికలు రూపొందించింది. సాగు చేసే రైతులకు అనేక ప్రోత్సాహకాలను అమలు చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆయిల్ పామ్ మిషన్(టీఎస్‌వోపీఎం)ను ఏర్పాటు చేసి వందల కోట్లను కేటాయించింది. మొక్కలు, డ్రిప్ పరికరాలు, మొక్కల నిర్వహణ వంటి అన్ని ప్రక్రియల్లో ప్రభుత్వపరంగా రైతులకు సాయం చేసేలా సబ్సిడీ విధానాన్ని అమలు చేసింది. రైతులకు పెట్టుబడి కోసం పంట మొదటి ఏడాదిలో రూ.12 వేలు, తర్వాతి నాలుగేండ్ల పాటు రూ.4200 చొప్పున చెల్లించింది. కానీ వ్యవసాయరంగంపై నిర్లక్ష్యం చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆయిల్ పాం రైతులను ఇబ్బందులు పెడుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం తరపున రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి ఖర్చుల చెల్లింపులను నిలిపివేసింది. ఈ తోటలను కాపాడుకునేందుకు రైతులు అప్పులు చేయాల్సి వస్తున్నది. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో కొత్తగా పంట సాగు చేయడం ఆగిపోతున్నది.

దేవాదుల నీళ్లు విడుదల చేయాలి

- గత ప్రభుత్వంలో మంజూరైన పనులు కొనసాగించాలి
- భట్టి, ఉత్తమ్‌లను కలిసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా

దేవరుప్పుల, మార్చి 25 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం మంజూరైన పలు పనులను కొనసాగించాలని, దేవాదుల నీటిని విడుదల చేసి జనగామ జిల్లా రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈమేరకు మంగళవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలో వారి ఛాంబర్లలో కలిశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్న సమయంలో పాలకుర్తి నియోజకవర్గంలో రూ.500 కోట్ల పనులు మంజూరు చేశానని కొన్ని పనులకు టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. నిలిచిన పనులను కొనసాగించాలని, వాటిని నిధులు విడుదల చేసేలా చూడాలని భట్టిని కోరారు. జనగామ జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న దేవాదుల ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల అవుతాయని ఆశతో రైతులు యాసంగి నాట్లు పెట్టి భంగపడ్డారని మంత్రి ఉత్తమ్‌కు వివరించారు. రిజర్వాయర్లు నింపకపోవడంతో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లో వరి ఎక్కువగా ఎండిపోతున్నదని ఇప్పటికైనా దేవన్నపేట పంపులు ఆన్ చేస్తే రైతులకు కొంతైనా మేలు జరుగుతుందని అక్కడే ఉన్న సంబంధిత సాగునీటి అధికారులకు వివరించారు.

ఉప ముఖ్యమంత్రి భట్టితో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

వరి పొలంలో పనులు చేసేందుకు వచ్చిన కూలీలపైకి లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. అదుపు తప్పి తమవైపే వేగంగా వస్తున్న వాహనం నుంచి తప్పించుకునేందుకు పరుగు తీసినా అందులోని పత్తి గింజల బస్తాలు మీద పడి ఊపిరాడకుండా చేశాయి. ఊహించని ఈ ప్రమాదం మంగళవారం సాయంత్రం టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్(టీ)లో జరుగగా, వరుసకు అత్తాకోడళ్లు అయిన మోకిడి పూలమ్మ(51), మోకిడి సంధ్య(30) మృతిచెందారు. రోడ్డు వైపు వెళ్లిన ఆరుగురికి ప్రాణాపాయం తప్పగా ఈ సంఘటన ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది.

పూలమ్మ మృతదేహాన్ని వెలికి తీస్తున్న స్థానికులు

దూసుకొచ్చిన మృత్యువు

- ఇద్దరు మహిళా కూలీల దుర్మరణం
- లారీ అదుపు తప్పి.. పత్తి గింజల బస్తాలు మీద పడి ప్రమాదం
- టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్(టీ)లో ఘటన

మోకిడి సంధ్య, పూలమ్మ (ఫైల్)

టేకుమట్ల, మార్చి 25 : అతి వేగంతో వచ్చిన ఓ లారీ వరి పొలంలో పనిచేస్తున్న మహిళా కూలీలపై బోల్తా పడడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్(టీ) గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు జరిగింది. స్థానికులు, కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణపూర్(టి)కి చెందిన మోకిడి పూలమ్మ(51), మోకిడి సంధ్య(30) మరికొంత మంది కూలీలలో కలిసి మేల్ ఫిమేల్ వరి పంటలో బెరుకులు/కలుతులు ఏరేందుకు వెళ్లారు. పొలంలోకి దిగేందుకు సిద్ధమవుతున్న తరుణంలో చిట్యాల మండలం శాంతినగర్ సమీప పత్తి మిల్లు నుంచి పత్తి గింజల లోడ్‌తో టేకుమట్ల వైపు వస్తున్న లారీ మూలమలుపు వద్ద వేగంగా వస్తూ అదుపు తప్పింది. వాహనం వేగంగా దూసుకురావడాన్ని గమనించి ఆరుగురు కూలీలు రోడ్డువైపికి పరుగెత్తగా ఇద్దరు మహిళలు పొలంలోకి దిగారు. లారీ కూడా అక్కడే ఒడ్డున ఉన్న చెట్టును ఢీకొనడం పొలంలోకి రావడంతో పత్తి గింజల బస్తాలు పూలమ్మ, సంధ్యపై పడడంతో వారిద్దరు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. చిట్యాల ఎస్ఐ శ్రావణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని, యంత్రాలతో లారీని పక్కకు తీయించారు. స్థానికుల సాయంతో మృతదేహాలను వెలికి తీసి చిట్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. లారీ డ్రైవర్ కొత్తూరు వినోద్ పరారు కాగా, అతడిది చిట్యాల మండలం కాల్వపల్లి గ్రామమని స్థానికులు తెలిపారు.

కండ్లముందే ఘటనతో తోటి కూలీలు షాక్

సంధ్యకు ఒక బాబు నిత్విన్, ఒక పాప శ్రియాన్వి ఉండగా, పూలమ్మకు ఒక కుమారుడు, మానసిక దివ్యాంగురాలైన కూతురు ఉంది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో రెండు కుటుంబాల్లోని పిల్లలకు తల్లులు దూరమయ్యారు. తోటి కూలీలు తమ కండ్లముందే మృతిచెందడం చూసి వాళ్లంతా షాక్‌కు గురై కన్నీటి పర్యంతమయ్యారు. రోజూ కూలి పనికి వెళ్లి బతికే ఆ రెండు కుటుంబాల్లో ఈ ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. తల్లులు దూరమై వారి పిల్లలు చేసిన రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. ప్రమాదానికి కారణమైన లారీ ఓనర్, డ్రైవర్‌పై చర్యలు తీసుకొని మృతుల కుటుంబాలకు ఆదుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

ఉపాధి పనులు చేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

పలుగు, పార పట్టి..

ఉపాధి కూలీలతో జనగామ కలెక్టర్ మమేకం

రఘునాథపల్లి, మార్చి 25 : నిత్యం పనుల్లో బిజీగా ఉండే జనగామ జిల్లా పాలనాధికారి షేక్ రిజ్వాన్ బాషా ఇలా పలుగు పార పట్టారు. కొద్దిసేపు కూలీగా మారిపోయి మట్టి పనులు చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. ఈ సందర్భంగా అక్కడున్న ఉపాధి హామీ కూలీలతో ముచ్చటించి వారి కుటుంబం, సమస్యలు, పనివేళలు, వస్తున్న కూలీపై ఆరా తీశారు. రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరిలో ఉపాధి కింద జరిగే రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఉదయం 11లోపు పనులు ముగించుకొని వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడాలని సూచించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. డీఆర్డీవో వసంత, ఎంపీడీవో శ్రీనివాస్ ఉన్నారు.

హనుమకొండ వాసికి ఐఏఆర్ఐ డాక్టరేట్

హైదరాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : దేశంలోనే అగ్రగామి సంస్థ భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఏఆర్ఐ) నుంచి హన్మకొండ జిల్లా రాంపేటకు చెందిన మా దం విక్రమార్జున్ యాదవ్ డాక్టరేట్ అందుకున్నారు. న్యూఢిల్లీ లోని నేషనల్ అగ్రికల్చర్ సైన్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 63వ స్నాతకోత్సవంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సహాయ మంత్రులు రామనాథ్ ఠాకూర్, భగీరథ్ ఠాకూర్, వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ కార్యదర్శి దేవేశ్ చతుర్వేది సమక్షంలో డాక్టరేట్ అందుకున్నారు.

హాస్టల్‌లో పేకాటపై విచారణకు కలెక్టర్ ఆదేశం

నమస్తే ఎఫెక్ట్

జనగామ చౌరస్తా, మార్చి 25 : జనగామలోని ధర్మకంచ ప్రభుత్వ ఎస్సీ వసతిగృహం(ఏ)లో సోమవారం ఆరుగురు విద్యార్థులు పేకాట ఆడిన విషయమై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా స్పందించిన సమగ్ర విచారణ చేయాలని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్‌తో పాటు ఆర్డీవో గోపీరామ్‌ను ఆదేశించారు. సంబంధిత అధికారులు మంగళవారం వసతిగృహంలో విచారణ జరిపి విద్యార్థులు పేకాడింది నిజమేనని తేల్చారు. అనంతరం విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థులను సరిగా పర్యవేక్షించని హాస్టల్ వార్డెన్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. త్వరలో ఈ వసతి గృహానికి కొత్త హాస్టల్ వెల్ఫేర్ అధికారి పర్యవేక్షణ అధికారిగా రానున్నట్లు తెలిసింది. కాగా ప్రస్తుతం ఈ హాస్టల్‌లో 21మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపం, వసతిగృహంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది.

తడిసిన మక్కల నుంచి నీళ్లను తొలగిస్తున్న రైతు

నేలవాలిన మక్కజొన్నను పరిశీలిస్తున్న ఏవో

మామిడికాయలను ఏరుతున్న రైతు

తడిసిన మక్క.. నేలరాలిన మామిడి

బయ్యారంలో గాలివానకు రైతన్న ఆగమాగం

బయ్యారం, మార్చి 25 : బయ్యారం ఏజెన్సీ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని కంబాలపల్లి, సుద్దరేవు, కొత్తగూడెం, కస్తూరినగర్, లింగగిరి, కొత్తపేట, గంధంపల్లి, నామాలపాడు, కోటగడ్డ, ఇర్సులాపురం తదితర ఏజెన్సీ గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మక్కజొన్న తడిసింది. చేనులో ఉన్న పంట నేలకొరిగింది. అష్టకష్టాలు పడి పంట సాగు చేస్తే చేతికొచ్చే సమయంలో నష్టం వాటిల్లిందని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. కొత్తపేట, నామాలపాడు, గంధంపల్లి, సంత్రాలపోడ్ తండాలో ఇటుక బట్టీల్లోని ఇటుకలు తడిసిపోయాయి. ఈదురుగాలులతో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. బీరోని మడవ, పందిపంపుల గ్రామాల్లో నేలకొరిగిన మక్కజొన్న పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి రాంజీనాయక్, ఏఈవో శిరీష పరిశీలించారు. అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

శ్రీతేజకు అరుదైన గౌరవం

అంతర్జాతీయ సదస్సులో ప్రసంగానికి అవార్డు, నగదు బహుమతి

చిన్నగూడూరు, మార్చి25: మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరుకు చెందిన మాటేటి శ్రీతేజకు అరుదైన గౌరవం దక్కింది. 'సోలనేషియన్ క్రాప్స్ ఇన్హిబిటింగ్ ప్లెటో ప్లాస్మాస్, సీడ్ ట్రాన్స్‌మిషన్ ఎపిడెమియోలాజికల్ ఇన్సైట్స్'అనే అంశంపై అమెరికాలోని మిసిసిపిలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించి అవార్డు, నగదు బహుమతిని అందుకున్నాడు. చిన్నగూడూరుకు చెందిన మాటేటి ఏకాంబ్రం(శ్రీతేజ తండ్రి) 40 ఏళ్ల క్రితం కాగజ్ నగర్‌కు వలస వెళ్లి, అనంతరం ఉన్నత చదువు చదివి గిరిజన సంక్షేమ గురుకులాల విభాగంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. తన ఇద్దరు కుమారుల్లో పెద్ద కుమారు డు శ్రీకర్ గూగుల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు శ్రీతేజ అగ్రికల్చర్ డిగ్రీ చేశాడు. అనంతరం అమెరికాలోని మిసిసిపి యూనివర్సిటీ రూ.10లక్షల ఫెలోషిప్ మంజూరు చేసి రిసెర్చ్ కోసం శ్రీతేజ్‌ను ఆహ్వానించింది. మారుమూల గ్రామానికి చెందిన శ్రీతేజ్ నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడంపై గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అవార్డు అందుకుంటున్న శ్రీతేజ

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు మృతి

- 1989లో అజ్ఞాతంలోకి వెళ్లిన సారయ్య
- మృతుడిది తరాలపల్లి గ్రామం

సారయ్య(ఫైల్)

మడికొండ, మార్చి 25: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్, కాంకేర్ జిల్లాల సరిహద్దుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని తరాలపల్లి గ్రామానికి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు అంకేశ్వరపు సారయ్య అలియాస్ సుధీర్ అలియాస్ సుధాకర్ మృతి చెందాడు. ఈమేరకు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. తరాలపల్లికి చెందిన అంకేశ్వరపు వెంకటయ్య, ఎల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కొడుకు సారయ్య, చిన్న కొడుకు రవీందర్. సారయ్య తరాలపల్లి పక్కనే ఉన్న కొండపర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసించాడు. ఆ తర్వాత 1989లో ఉద్యమం కోసం అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఆయన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సారయ్య మృతి చెందాడు. ఆయన మృతదేహం కోసం కుటుంబ సభ్యులు బయలుదేరి వెళ్లారు. దీంతో తరాలపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా, సారయ్యపై రూ.20 లక్షల రివార్డును ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రకటించింది.

రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారు సంఘాల మేళా ప్రారంభం



స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యే జంగా, కలెక్టర్ సత్యశారద

- రైతులకు అందుబాటులో ఆధునిక యంత్రాలు, పనిముట్లు
- పాల్గొన్న ఎమ్మెల్సీ సారయ్య, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా, కలెక్టర్ సత్యశారద

కరీమాబాద్, మార్చి 25 : వరంగల్ నగరంలోని నక్కలపల్లి రోడ్డులో రాష్ట్రస్థాయి రైతు ఉత్పత్తిదారు సంఘాల మేళా మంగళవారం ప్రారంభమైంది. స్మాల్ ఫార్మర్స్ అగ్రి బిజినెస్ కన్సార్టియం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మేళాను ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి ప్రారంభించారు. ఈ మేళాలో సుమారు 40 రైతు ఉత్పత్తిదారు సంఘాలకు సంబంధించిన యంత్రాలు, పనిముట్ల ప్రదర్శన, అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ రైతులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర స్థాయి రైతు ఉత్పత్తిదారు సంఘాల ఉద్దేశం, లక్ష్యాలు, విజయాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పొందే వివిధ బ్యాంకు లింకేజీ పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడు తూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అధిక లాభాలు వచ్చేలా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కృషి చేయాలన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి యంత్రాలు, పనిముట్ల పనితీరు, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏసీ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ రామన్‌సింగ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పీజేటీఏయూ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ సుజాత, వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఉద్యాన అధికారి సంగీతలక్ష్మి, మార్కెటింగ్ అధికారి సురేఖ పాల్గొన్నారు.

నష్టపోయిన మక్క రైతులకు పరిహారం

- రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- మక్కజొన్న విత్తన వైఫల్యంపై అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న కోదండరెడ్డి

ములుగు రూరల్, మార్చి 25 : ములు గు జిల్లాలో మక్కజొన్న పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని, విత్తన సంస్థల నుంచి పరిహారం అందేలా చూస్తుందని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మక్కజొన్న విత్తన వైఫల్యంపై ఆయన రైతు విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, సభ్యులు రాంరెడ్డి, గంగాధర్, నర్సింహారెడ్డి, వెంకన్నయాదవ్‌తో కలిసి స్థానిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మక్కజొన్న విత్తన వైఫల్యంపై చేపట్టిన చర్యలను వివరించారు. జిల్లాలో మొత్తం 959 మంది రైతులు సాగుచేసిన 2,161 ఎకరాల్లోని మక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందన్నారు. విత్తన కంపెనీలు రైతుల బ్యాంకు ఖాతాల్లో నష్టపరిహారం డబ్బులు జమచేసేలా ఆదేశాలు జారీచేశామని తెలిపారు. రైతుల ఆరోగ్య విషయంలో జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో కమిటీ వేసి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ నష్టపోయిన మక్కజొన్న రైతులకు పరిహారం చెల్లించాలని, అధిక వడ్డీ రుణాలను నిరోధించాలని, రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ పలు స్వల్ప, దీర్ఘకాలిక పరిష్కార మార్గాలతో రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, అధైర్యపడొద్దన్నారు. బహుళ జాతి సంస్థలు విచ్చల విడిగా రైతులతో విత్తనోత్పత్తి చేయించి అన్నదాతలను ఆర్థికంగా దెబ్బతీస్తున్నారని అన్నారు. ములుగు జిల్లాలో జరిగిన సంఘటనలు తెలిసి నిపుణుల కమిటీని వేశామన్నారు. బాధిత రైతులు, కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు, అన్ని శాఖల అధికారులతో చర్చించిన అనంతరం కమిషన్ ద్వారా ఒక నిర్దిష్టమైన పాలసీని రూపొందించి రాష్ట్రం మొత్తానికి వర్తింపజేసేలా ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. బహుళ జాతి కంపెనీలు రైతులను మోసం చేసిన విషయం బట్టబయలైందన్నారు. ఆదివాసీ ప్రాంతంలో జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలు అడుగడుగునా కమిషన్ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని త్వరలోనే నిపుణులు, మేధావులతో చర్చించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ కోరనున్నదని కోదండరెడ్డి తెలిపారు. సమీక్షలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్‌లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఆర్డీవో వెంకటేశ్, సలహాదారులు నర్సింహారెడ్డి, రామాంజనేయులు, సుచరిత, విత్తన కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లు, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరు విత్తన దళారులపై కేసులు

ఏటూరునాగారం, మార్చి 25 : మక్కజొన్న విత్తన కంపెనీ దళారులపై వాజేడు, వెంకటాపురం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు మంగళవారం రాత్రి ఏఎస్పీ శివం ఉపాధ్యాయ వివరాలు వెల్లడించారు. వెంకటాపురం మండలం యోగిత నగరం గ్రామానికి చెందిన రైతు పాయం రాంబాబు హైటెక్ కంపెనీ దళారీ మన్యం సురేశ్ వద్ద మక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేసి నాలుగెకరాల్లో విత్తగా రూ.5 లక్షలు నష్టం వచ్చింది. అధిక దిగుబడులు వస్తాయని సురేశ్ చెప్పడంతో అతని మాటలు నమ్మి మోసపోయినట్లు రాంబాబు ఫిర్యాదు చేశాడు. అదేవిధం గా వాజేడు మండలం పూసూరు గ్రామానికి చెందిన రైతు జాడి రాంబాబు తొమ్మిది ఎకరాల్లో బేయర్ కంపెనీకి చెందిన విత్తనాలు సాగు చేసి నష్టపోయాడు. మంగపేట మండలం తిమ్మంపేటకు చెందిన చిలకమారి వేణు అధిక దిగుబడి వస్తుందని నమ్మించడంతో విత్తనాలు తీసుకుని సాగు చేయగా రూ.7 లక్షల నష్టం రావడంతో జాడి రాంబాబు ఫిర్యాదు చేశాడు. దీంతో సురేశ్, వేణుపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు.